కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసిన ట్రేసా బృందం

నూతన కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు ఘన స్వాగతం

వికారాబాద్,జూన్ 18 : తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) వికారాబాద్ బృందం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యానాయక్‌తో మంగళవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. దీంతోపాటు జిల్లాలోని తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది కూడా కలిశారు. కార్యక్రమంలో ట్రేసా రాష్ట్ర కార్యదర్శి మనోహర్ చక్రవర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయేందర్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు దీపక్, వికారాబాద్ డివిజన్ అధ్యక్షుడు రమేశ్, తాండూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి వీరేశ్‌బాబు, రెవెన్యూ యూనియన్ సభ్యులు విజయ్, సిబ్బంది కుమార్, పురుషోత్తం, గణేశ్, మురళీధర్, సురేశ్, విజయ్, శ్రీలత, రాజేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మోహన్ ఉన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

ధారూరు : తెలంగాణ రాష్ట్ర వీఆర్ఏ హక్కుల సాధన సమితి వికారాబాద్ సంఘ సభ్యులు మంగళవారం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి నూతన కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను నోటు పుస్తకాలు, పెన్సిళ్లు ఇచ్చి ధన్యవాదములతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ సత్యనారాయణ, జిల్లా యూనియన్ నాయకులు శివకుమార్, సరోజ, జనార్దన్, యాదగిరి, శ్రీనివాస్ ఉన్నారు.

శాస్త్రీయ పద్ధతులు పాటించాలి

వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్

పూడూరు, జూన్ 18 : పంట సాగులో రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించి మంచి దిగుబడి పొందాలని వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం పూడూరులోని రైతు వేదికలో రైతు నేస్తం (వీడియో కాన్ఫరెన్స్) నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ రైతులను ఉద్దేశించి ప్రస్తుతం వ్యవసాయంలో వరి, మొక్కజొన్న సాగు పద్ధతులు, మెళకువలను వీడియో కాన్ఫరెన్స్‌లో వివరించారు. రైతులు సరైన వర్షాలు కురిసిన తర్వాతే విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో సరైన వర్షం కురువలేదన్నారు. శాస్త్రీయ పద్ధతుల ద్వారా సాగు చేస్తే మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధికారి లక్ష్మీ కుమారి, పరిగి, దోమ, పూడూరు, కులకచర్ల, చౌడపూర్ మండలాల వ్యవసాయాధికారులు, విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

కాన్ఫరెన్స్‌కు పట్టుమని పది మంది రైతులు కూడా హాజరుకాని వైనం

వీడియో కాన్ఫరెన్స్‌కు మండలంలోని ఆయా గ్రామాల రైతుల హాజరై పంట సాగు పద్ధతులపై అవగాహన పొందాల్సి ఉంటుంది. మండలంలో 31 గ్రామ పంచాయతీల నుంచి 10 మంది రైతులు కూడా హాజరు కాకపోవడం శోచనీయంగా ఉన్నదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. మొక్కజొన్న సాగు పద్ధతులు, మెళకువలను వీడియో కాన్ఫరెన్స్‌లో వివరించే విషయం స్థానిక రైతులకే తెలియదని కొందరు రైతులు వాపోతున్నారు. వ్యవసాయాధికారుల పనితీరుపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



వరి, మొక్కజొన్న సాగు పద్ధతులు, మెళకువలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరిస్తున్న డీఏవో



కలెక్టరేట్ పరిపాలనా అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కృష్ణయాదవ్ తదితరులు

బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో

42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్

వికారాబాద్, జూన్ 18 : ఆరు నెలల లోపు బీసీల కుల గణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా బీసీల కుల గణన చేపట్టలేదని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ తెలిపారు.

బుధవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పరిపాలనా అధికారి అమరేందర్‌కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకలంలో నిర్వహించాల్సిన సర్పంచ్ ఎన్నికలను వాయిదా వేయడం వల్ల గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకే రోజులో సకల జనుల సర్వే నిర్వహించి సబ్బండ వర్గాల ప్రజల సంపూర్ణ సమాచారాన్ని సేకరించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వారం లోగా రాష్ట్రంలోని బీసీల జనాభా గణన సంపూర్ణంగా చేపట్టాలన్నారు. ఆలస్యం చేయడం కేవలం రాజకీయ కారణమేనని, బీసీ కులాల గణన చేపట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించి సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే బీసీ సేన ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సంగమేశ్ కురుమ, లక్ష్మణ్ యాదవ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్స్‌కు బాలబాలికల ఎంపిక

వికారాబాద్, జూన్ 18 : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో ఉన్న స్పోర్ట్స్ స్కూళ్లలో (హకీంపేట, కరీంనగర్, అదిలాబాద్) 4వ తరగతి ప్రవేశాల కోసం మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో బాలబాలికలను ఎంపిక చేయనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి హన్మంత్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 25 తేదీల్లో మండల స్థాయిలో విద్యాధికారి ఆధ్వర్యంలో వ్యాయామ అధ్యాపకుల ద్వారా ఎంపిక నిర్వహించబడుతుందన్నారు. మండల స్థాయిలో ఎంపికైన వారికి జిల్లా స్థాయిలో జూలై 3న వికారాబాద్ బ్లాక్ గ్రౌండ్‌లో ఎంపిక ప్రక్రియ ఉంటుందని తెలిపారు. ఉదయం 8 గంటలలోపు రిపోర్ట్ చేయాలని కోరారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి జూలై 11, 12 తేదీల్లో స్పోర్ట్స్ స్కూల్ హకీంపేటలో రాష్ట్ర స్థాయి ఎంపిక నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్, జనన ధ్రువపత్రం(మున్సిపల్, పంచాయతీ), కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు సమర్పించాలని పేర్కొన్నారు. మూడో తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, పాస్‌పోర్ట్ ఫొటోలతో హాజరు కావాల్సిందిగా కోరారు. విద్యార్థులు 1 సెప్టెంబర్ 2015 నుంచి 1 సెప్టెంబర్ 2015 లోపు జన్మించి ఉండాలన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న

కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న స్వప్న తదితరులు

రంగారెడ్డి, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజనం మెనూ బిల్లులను వెంటనే విడుదల చేయాలని మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎలమోని స్వప్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, డీఈవో కార్యాలయంలో వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి మరీ విద్యార్థులకు భోజనం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల వేతనం చెల్లించాలని కోరారు. గృహలక్ష్మి పథకం కింద గ్యాస్ సిలిండర్‌ను రూ.500లకే మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 24న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా చేస్తామని స్వప్న హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ జిల్లా నాయకులు కృష్ణ, ఎల్లేశ, మధ్యాహ్న భోజన పథకం కార్మిక యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గణేశ్, కోశాధికారి సరిత ఉన్నారు.

మంగళవారం యాలాలలోని రైతు వేదికలో వ్యవసాయ మండల, డివిజన్ స్థాయి అధికారులకు పత్తి సాగుపై శాస్త్రవేత్త లక్ష్మణ్ మండల వ్యవసాయాధికారి యాదగిరితో కలసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన సహాయ వ్యవసాయ సంచాలకులు, తాండూరు డాట్ సెంటర్ శాస్త్రవేత్త లక్ష్మణ్ - యాలాల, జూన్ 18

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

అబిడ్స్, జూన్ 18: అంతర్జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ అనుబంధ విద్యా సంస్థ అయిన సరోజినీ నాయుడు వనితా ఫార్మసీ మహా విద్యాలయ చైర్మన్ డాక్టర్ ప్రభాశంకర్ అధ్యక్షతన మంగళవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని గాంధీ సెంటినరీ హాల్‌లో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకల ముగింపు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వెనుకబడిన ప్రాంతాల్లో విద్యావ్యాప్తికి పాటుపడుతూ సామాజిక బాధ్యతను నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీ కృషి అభినందనీయమని కొనియాడారు. ఎగ్జిబిషన్ సొసైటీకి అనుబంధంగా ఉన్న విద్యా సంస్థలకు, ఇక్కడి విద్యార్థులకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని విద్యా సంస్థలను స్థాపించి తెలంగాణలో విద్యను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం చేపడుతున్న విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సొసైటీ ప్రతినిధులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు సర్టిఫికెట్‌లు, మెడల్స్‌ను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు అష్వాక్ హైదర్, డాక్టర్ గంగాధర్‌రావు, బీఎన్ రాజేశ్వర్, జీవీ రంగారెడ్డి, ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి హనుమంతరావు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మమత, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శిరీష, ప్రొఫెసర్ శ్రీనివాస్, కళాశాల కార్యదర్శి సాయినాథ్ దయాకర్ శాస్త్రి, ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సరోజినీ నాయుడు వనితా ఫార్మసీ మహా విద్యాలయ చైర్మన్ డాక్టర్ డాక్టర్ ప్రభాశంకర్‌ను సత్కరిస్తున్న ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ఎన్జీఆర్ఐ సందర్శన

సిటీబ్యూరో, జూన్ 18(నమస్తే తెలంగాణ) : ఐఐటీ ధన్‌బాద్, ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన 26 మంది విద్యార్థులు హైదరాబాద్‌లోని ఎన్జీఆర్ఐని సందర్శించారు. మంగళవారం ఉదయం క్యాంపస్‌లో పర్యటించి పరిశోధనా కేంద్రంలో ఉన్న పలు విభాగాలను విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఎన్జీఆర్ఐ పరిశోధకుడు డా.దేవేందర్‌కుమార్ విద్యార్థుల బృందానికి రీసెర్చ్ సెంటర్‌లో జరుగుతున్న పలు అధ్యయనాలు, పరిశోధనలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎన్జీఆర్ఐ డైరెక్టర్ డా.ప్రకాశ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మోకిల శారీధాన్‌కు విశేష స్పందన

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): పారిశుద్ధ్యంపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు గండిపేట వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మోకిల శారీధాన్‌కు విశేష స్పందన వచ్చిందని వాణి తెలిపారు. శారీధాన్‌లో భాగంగా మోకిల లోని పీజీ హిల్స్‌లో నిర్వహించిన 5కే రన్, 3కే రన్ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. 5కే రన్ కార్యక్రమాన్ని తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద నేరెళ్ల, రచయిత, నటి గీతా భాస్కర్, భవాని జెండా ఊపి ప్రారంభించారన్నారు.

20 నుంచి 22 వరకు రిజిస్ట్రేషన్ మేళా

షాబాద్, జూన్ 18 : రంగారెడ్డిజిల్లాలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులకు జిల్లా ఉపాధి కార్యాలయంలో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, నేషనల్ కెరీర్ సర్వీస్ రిజిస్ట్రేషన్ మేళా ఈ నెల 20 నుంచి 22 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయ అధికారి జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ కోసం సంబంధిత అర్హత సర్టిఫికెట్‌లు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాఠశాల బోనఫైడ్ సర్టిఫికెట్‌లను ఒరిజినల్‌తో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా ఉపాధి కార్యాలయం, శాంతినగర్ ఐటీఐ క్యాంపస్, 9063099306/9676379303లను సంప్రదించాలని సూచించారు.

ఎథికల్ హ్యాకింగ్ కోర్సుల్లో శిక్షణ

కాచిగూడ, జూన్ 18 : కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో కంప్యూటర్ శిక్షణ, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ కోర్సుల్లో శిక్షణకు తెలంగాణవ్యాప్తంగా ఆసక్తి గల యువతీ యువకుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు నేషనల్ స్కిల్ అకాడమీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్రీమాన్ రెడ్డి తెలిపారు. మంగళవారం కాచిగూడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఇన్‌ఫర్మేషన్ రంగం, ఆర్కిటెక్ట్, సెక్యూరిటీ విభాగం, మిషన్ లెర్నింగ్, బిజినెస్ అనలిస్ట్, డేటా సైన్స్, బిగ్‌డేటా, క్లౌడ్ కంప్యూటర్, జావా, ఒరాకిల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, డిప్లొమా, పీజీ, ఇంజినీరింగ్ చదివిన యువకులు 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9505800050, www.nationalskillacademy.iaయలో సంప్రదించవచ్చని ఆయన కోరారు.

నీట్‌ను రద్దు చేయాల్సిందే..

నీట్‌కు వ్యతిరేకంగా గొంతెత్తిన విద్యార్థులు

అక్కడ మోదీ.. ఇక్కడ సీఎం మౌనం దేనికి.. విచారణ చేయాలంటూ డిమాండ్

బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాజ్‌భవన్ ముట్టడి..

గేట్లు దూకేందుకు విద్యార్థుల యత్నం.. అరెస్టు చేసిన పోలీసులు

సిటీబ్యూరో/ఖైరతాబాద్/హిమాయత్‌నగర్, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : ''మోదీ దిగిపో.. తప్పుని ఒప్పుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలి. 24 లక్షల మంది విద్యార్థుల ఉసురుతగులుతది. ఎవరి ప్రయోజనాల కోసం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడారు? మీ స్వార్థం.. మీ లాభం కోసం మా అవకాశాలను అమ్ముకుంటారా? ఈ లీకేజీ వెనక ఉన్నది ఎవ్వరు? దేశ వ్యాప్తంగా నీట్ అవకతవకలపై పెద్ద ఎత్తున నిరసన జరుగుతుంటే ప్రధాని మౌనంగా ఉండటం సిగ్గుచేటు. ప్రతి విద్యార్థి కన్నీటి చుక్కకు కేంద్రం సమాధానం చెప్పాలి. నీట్ పరీక్షను రద్దు చేయాలి. లేకపోతే దేశ వ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తాం. సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడ మౌనంగా ఉండటం కూడా మోదీ మెప్పు పొందడానికేనా? ఇక్కడి బిడ్డలకు అన్యాయం జరిగితే స్పందించరా? స్పందించకపోతే సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తాం.'' అంటూ సుమారు 12 విద్యార్థి సంఘాలు బీఆర్ఎస్వీ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, విద్యార్థి జనసమితి, డీవైఎఫ్ఐ, పీవైఎల్, ఆమ్ ఆద్మీపార్టీ విద్యార్థి విభాగాల నాయకులు నీట్ అవకతవకలపై విరుచుకుపడ్డారు. పీఎం మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉంటున్నారో సమాధానం చెప్పాలంటూ నినదించారు. పెద్ద ఎత్తున విద్యార్థులు నీట్‌కు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో పోస్టర్లు, బ్యానర్లు ప్రదర్శిస్తూ గొంతెత్తారు. నారాయణ గూడ నుంచి లిబర్టీ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. పీఎం డౌన్ డౌన్.. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు హోరెత్తించారు. నీట్ అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు.

రాజ్‌భవన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

రాజ్‌భవన్ ముట్టడి ఉద్రిక్తం

బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాజ్‌భవన్ ముట్టడి యత్నం జరిగింది. మెరుపు ముట్టడితో రాజ్‌భవన్ వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులు రాజ్‌భవన్ గేట్లు ఎక్కేందుకు ప్రయత్నించారు. పెద్ద సంఖ్యలో రోడ్డుపై బైఠాయించి కేంద్ర వైఖరిని, రాష్ట్ర ప్రభుత్వ అలసత్వాన్ని ఎండగట్టారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. మూడున్నర కోట్ల జనాభా ఉన్న తెలంగాణలో 8,850 సీట్లు ఉన్నాయని, 25 కోట్ల జనాభా ఉన్న ఉత్తర్ ప్రదేశ్‌లో 9,500 సీట్లు ఉన్నాయని, తద్వారా ఎక్కువ సీట్లు ఉత్తర భారతదేశానికే పోతున్నాయన్నారు. ఇటీవల జరిగిన నీట్ ప్రవేశ పరీక్షల్లో ఇక్కడి నుంచి వేలాది మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఎడ్యుకేషన్ హబ్‌గా ఉన్న హైదరాబాద్‌కు ఒక్క సీటు కూడా రాకపోవడం విచారకరమన్నారు. ఒక్క ఎంబీబీఎస్ మాత్రమే కాదని.. ఆయుష్, వెటర్నరీ, బీడీఎస్ తదితర విభాగాల్లోనూ తెలంగాణకు నష్టం జరుగుతుందన్నారు. నీట్ పరీక్షలు నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని ముందుగా రద్దు చేయాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ వైద్య రంగానికి పెద్ద పీట వేశారని, జిల్లా కేంద్రాల్లో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడం వల్ల కావాల్సినంత సీట్లు స్థానిక విద్యార్థులకు లభించాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దక్షిణాదిపై వివక్ష చూపుతున్నదని, 150 వైద్య కళాశాలలు కేటాయించగా, అందులో ఒక్కటి కూడా తెలంగాణకు ఇవ్వకపోవడంతోనే వివక్ష వెలుగుచూసిందన్నారు. ఇప్పటికే తమిళనాడు ప్రభుత్వం నీట్‌ను వ్యతిరేకించిందని, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం పట్టించుకోవడం లేదని, వెంటనే కేబినేట్ తీర్మానం చేసి నీట్ నుంచి తెలంగాణను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ వ్యవహారంలో బీజేపీ నేతల హస్తం ఉందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సీఎం స్పందించకుంటే ఆయన కార్యాలయాన్ని సైతం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు జంగయ్య, నితీశ్, విశాల్, లోకేశ్, శ్యామ్, రాహుల్, వంశీ పాల్గొన్నారు.

ఆందోళనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు..

బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 18 : గత నెల 5న దేశంలోని 571 నగరాల్లోని 4,750 కేంద్రాల్లో నిర్వహించిన నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు డిమాండ్ చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఒక ప్రవేశ పరీక్షలో 67 మంది గరిష్ఠ మార్కులు సాధించడం గిన్నీస్ రికార్డు సాధించడమేనని ఎద్దేవా చేశారు. ఎన్టీయే భాగస్వామి జేడీయూ అధికారంలో ఉన్న బీహార్ రాష్ట్రం నీట్ పరీక్షలో అక్రమాలకు వేదికవడం సిగ్గుచేటన్నారు. దేశంలో 70 వేల సీట్ల కోసం జరిగే నీట్ పరీక్షల్లో ప్రతిభ కన్న డబ్బే ప్రధానం అనే రీతిలో వ్యవహరించడం సరికాదన్నారు. దేశంలో ఒక వైపు ఈవీఎం ట్యాంపరింగ్, మరోవైపు నీట్ లీకేజీలు, కూటమి పార్టీలకు ప్యాకేజీలతో దేశాన్ని భ్రష్టుపట్టిస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే నీట్ పరీక్షను రద్దు చేసి, తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు.

స్టెమ్ సబ్జెకుల్లో మహిళలకు ప్రోత్సాహం

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : మహిళలకు సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్) అంశాల్లో నైపుణ్యం పెంపొందించేందుకు సింజీన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ సహకారంతో మహిళలకు స్కాలర్‌షిప్, మెంటరింగ్ చేస్తున్నది. తాజాగా మంగళవారం టీ హబ్‌లో జరిగిన రెండో విడత కార్యక్రమానికి 549 దరఖాస్తులు వచ్చాయని సింజీన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ అనుపమ శెట్టి తెలిపారు. మొదటి విడతలో 21 మంది మహిళలను ప్రోత్సహించామని తెలిపారు. రెండో విడతలోనూ మరింత మంది మహిళలకు అకడమిక్ కెరీర్ ఎదుగుదలతో తోడ్పడేలా చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఆశవర్కర్ల సేవలు అభినందనీయం

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : ఆశ వర్కర్ల ప్రాధాన్యతను గుర్తించి వారికి అత్యధికంగా ఇన్‌సెంటివ్స్ రూ.9,900 అందిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో ఉన్నదని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 14న నమస్తే తెలంగాణలో 'చాకిరి బారెడు.. వేతనం మూరెడు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై కమిషనర్ స్పందిస్తూ.. ఆరోగ్య రంగంలో ఆశ వర్కర్ల పాత్ర చాలా కీలకమైనదని పేర్కొన్నారు. గుజరాత్, కేరళ, రాజస్థాన్, కర్ణాటక, సిక్కిం తదితర రాష్ట్రాల్లో ఆశ వర్కర్లకు రూ.4 వేల నుంచి రూ.6వేల మధ్యలోనే వేతనం చెల్లిస్తున్నారని తెలిపారు. ఆశ వర్కర్లకు ప్రోత్సాహం అందించేందుకు ఎన్ఐఓఎస్ సర్టిఫికెట్‌ను సాధించిన వారు అదనంగా రూ.5వేలు పొందుతారని తెలిపారు. ఆసక్తిగల ఆశ వర్కర్ల సర్టిఫికేట్ పొందాలనుకుంటే వారి పేర్లను తమకు అందించి పరీక్షకు హాజరవ్వాలని కోరారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 40 శాతం మంది ఆశవర్కర్లు తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు.

అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీని నియమించండి

టాసా అధ్యక్షుడు విద్యాసాగర్

వ్యవసాయ యూనివర్సిటీ, జూన్ 18: ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ నియామకాలపై ప్రభుత్వం జాప్యం చేస్తుందని దీంతో ఇటు విద్యార్థులకు రైతులకు అపార నష్టం జరుగుతుందని తెలంగాణ అగ్రికల్చర్ శాస్త్రవేత్తల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు (టాసా) విద్యాసాగర్ తెలిపారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ రంగాలను చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు అనేక హామీలిచ్చిన ఆయన ఇప్పుడు ఆయా రంగాలను చిన్నచూపు చూడటంలో అంతర్యమేమిటన్నారు. యూనివర్సిటీకి పూర్తిస్థాయి పాలక వర్గం, పర్మినెంట్ యూనివర్సిటీ అధికారులు, వీసీ లేకపోవడం, ప్రధాన నిర్ణయాలు తీసుకోకపోవడంతో దిశానిర్దేశంలేని పరిస్థితి దాపురించిందన్నారు. మెడికల్ బిల్లు క్యాంపులోకి ఆర్టీసీ బస్సులు, హెల్త్ సెంటర్ సమస్యలు అధికమయ్యాయన్నారు. విద్యార్థుల సంఖ్య పెరగడం, వసతి సౌకర్యాలు తగ్గడం విద్యార్థి, ఉపాధ